www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 20 మార్చి 2025

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి : ఇఇ

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి డివిజన్ పరిధిలోని 21 శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు రాయచోటి డివిజన్ ఆఫీస్ కాంపౌండ్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యుగంధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కాని తమ సమస్యలను ప్రత్యేక విద్యుత్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ విద్యుత్ అదాలత్‌లో చైర్ పర్సన్ వి.శ్రీనివాస్ ఆంజనేయమూర్తి, రిటైర్డ్ జడ్జి, ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్.ఆర్ ఆంజనేయకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. రాయచోటి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సమస్యలను రాతపూర్వక ఫిర్యాదు ద్వారా సమస్యలను పరిష్కరించు కోవాలని కోరారు.

మాట్లాడుతున్న యుగంధర్

నత్తనడకన ఆర్‌డిఎస్‌ఎస్ స్కీమ్!

- రూ.463 కోట్లతో పనులకు శ్రీకారం
- కడప జిల్లాలో 29 శాతమే పూర్తి
- నెలాఖరుతో గడువు ముగింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆర్‌డిఎస్‌ఎస్ (రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ ఆఫ్ స్కీమ్) నత్తనడకన సాగుతోంది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల భాగస్వామ్యంతో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల లోఓల్టేజీ సమస్య పరిష్కారం, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ఎపి ట్రాన్స్‌కో చేపట్టింది. కడప జిల్లాలో రూ.463 కోట్లతో, అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో రూ.409 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టింది. 2024 మార్చిలో టెండర్లు పిలిచింది. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టు పనుల టెండరును షిర్డీ సాయి ఎలక్ట్రికల్ సంస్థ దక్కించుకుంది. టెండరు నిబంధనల ప్రకారం ఏడాది వ్యవధిలో గృహ, వ్యవసాయ సర్వీసుల ఫీడర్లను, లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేసి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో విఫలమైంది.

జిల్లాలోని కడప, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు అసెంబ్లీ పరిధిలో 11కెవి 392 ఫీడర్లు ఉన్నాయి. కడప అసెంబ్లీ పరిధిలో 65 ఫీడర్లలో 11 ఫీడర్లు, పులివెందుల పరిధిలో 95 ఫీడర్లలో 06, మైదుకూరు పరిధిలోని 148 ఫీడర్లలో 36, ప్రొద్దుటూరు పరిధిలోని 84 ఫీడర్లలో 05 ఫీడర్ల చొప్పున 58 ఫీడర్ల పనులు పూర్తి స్థాయి ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. మిగిలిన 198 ఫీడర్ల పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. 11కెవి లైన్లు 265 కిలోమీటర్లలో 1,033 కి.మీ, 3,639 ట్రాన్స్‌ఫార్మర్లలో 453 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే పూర్తి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కెవి.లైన్లు 38.98 శాతం, ట్రాన్స్‌ఫార్మర్ల్ 12.45 శాతం పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి మరో 62.12 శాతం పనులు, ఫీడర్స్ కేటగిరీలో 70.69 శాతం పనులు, ట్రాన్స్‌ఫార్మర్స్ కేటగిరీలో 88.55 శాతం మేర పనులు పూర్తి చేయా ల్సి ఉంది.

అన్నమయ్య జిల్లాలో అంతంతే!

అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీ పరిధిలో 232 11 కెవి ఫీడర్లలో 50 ఫీడర్లు మాత్రమే ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. మిగిలిన 112 ఫీడర్లను, 2,307 కి.మీ 11కెవి లైన్ నిర్మాణ పనుల్లో 454 కి.మీ మాత్రమే పూర్తి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా లోని 3,225 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో 116 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసింది. ఫీడర్లలో 44.64 శాతం, 11 కెవిలైన్ల ఏర్పాటులో 19.61 శాతం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో 3.60 శాతం మాత్రమే పూర్తి చేసింది. మదనపల్లి, పీలేరు నియోజకవర్గాలకు చెందిన 245 కెవి ఫీడర్లలో 118 ఫీడర్ల పనులు నిర్మాణంలో ఉండగా, 32 ఫీడర్లు మాత్రమే పూర్తి చేసింది.

సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు (ఫైల్ ఫోటో)

ఆది నుంచి అవాంతరాలే!

రాజకీయ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కాంట్రాక్టు సంస్థ ఆశించిన వేగం పెంచడంలో మీనమేషాలు లెక్కించింది. మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ నుంచి సార్వత్రిక ఎన్నికల రాజకీయ వాతావరణం నేపథ్యంలో ఆశించిన మేరకు పనులు సాగలేదు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల విషయంలో నాన్చుడుధోరణి అవలంబించింది. రూ.215 కోట్ల మేరకు పనులు చేసింది. 29.29 శాతం పనులకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగించింది.

గడువు పొడిగించేనా!

మార్చి నెలాఖరు నాటికి కాంట్రాక్టు గడువు ముగియనున్న నేపథ్యంలో కేంద్రం అందించే గ్రాంట్లు వడ్డీ ఖాతాలో జమ అవుతాయనే నిబంధన ఉన్న నేపథ్యంలో సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు మరోఏడాది పాటు నిధుల వినియోగం, కాంట్రాక్టు సంస్థకు గడువు పొడిగింపు ఇస్తుందా అనేది వేచి చూడా ల్సి ఉంది.

స్కీము పనుల్ని వేగవంతం చేస్తాం

ఆర్‌డిఎస్‌ఎస్ స్కీమ్ పనుల్ని వేగవంతం చేస్తాం. ఉత్తర భారతంలో హోళీ ముగిసింది. లేబర్ అందుబాటులోకి రానుంది. ఈ నెలాఖరు నాటికి 50 శాతం పనులు చేపడతాం. కాంట్రాక్టు గడువు పొడిగింపు అవకాశాల నేపథ్యంలో కాంట్రాక్టర్లు, సబ్‌కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశాలు నిర్వహించాం. స్వల్ప వ్యవధిలోనే స్కీమ్ పరుగులు పెడుతుందని భావిస్తున్నాం.

- ఎస్.రమణ, విద్యుత్ ఎస్ఇ, కడప.

అదనపు సాయం లబ్ధిదారునికి అందాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

పూర్తయిన పల్లెపండుగ పనులను ఉగాది రోజున ప్రారంభించాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల వారికి ఇళ్ల నిర్మాణానికి ఇస్తున్న అదనపు ఆర్థిక సాయం లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ సిబ్బంది, విఆర్‌ఒలు, సర్వే సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పిజి ఆర్‌ఎస్ ద్వారా అందిన అర్జీలు, రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలు, రీసర్వే, ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్, పల్లెపండుగ కార్యక్రమాలు, ఎన్‌టిఆర్ హౌసింగ్, పి4 సర్వే అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ పక్కాగా జరగాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 17 రకాల అంశాలను ఆధారంగా చేసుకొని అనర్హులను తీసివేయాలని చెప్పారు. అర్హులకు మాత్రమే ఇళ్ల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పిజిఆర్‌ఎస్ ద్వారా అందిన అర్జీలు రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన అర్జీలపై సమీక్షిస్తూ అర్జీలను త్వరితగతిన నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమాలు, నరేగా పనుల పై సమీక్షిస్తూ దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయని ఎంపిడిఒలు అందరూ మంచి పురోగతి సాధించారని అభినందించారు. పూర్తయిన పల్లె పండుగ పనుల ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని, వారిని ఆహ్వానించి ఉగాది రోజున ప్రారంభించాలని సూచించారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ పథకంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తూ ఎస్‌సి, ఎస్‌టి,బిసి వర్గాలకు ఇస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకొని ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. పి-4 సర్వే పై సమీక్షిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభల నిర్వహణ అనంతరం ఆర్థిక పిరమిడ్‌లో దిగువన ఉన్న 20 శాతం లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

డిఆర్‌ఒ మధుసూదన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో15 నెలల బకాయి జీతాలు రాక వెట్టిచాకిరి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం పెండింగ్ జీతాలిచ్చి ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు వైసిపి ప్రభుత్వంలో 2023 జూన్ నుండి -24 జూన్ వరకు 12 నెలలు, టిడిపి ప్రభుత్వంలో 3 నెలలు మొత్తం 15 నెలలు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డిఆర్‌ఒ మధు సూదన్‌రావుకు జీతాలిప్పించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వేతనాలు రాక కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్యం, కుటుంబ అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా జిల్లా, రాష్ట్ర అధికారుల దృష్టికి పలు దఫాలుగా మా సమస్యలు విన్నవించినప్పటికి గౌరవ వేతనాలు మేము వేయబోతున్నాము అధైర్య పడవద్దని పదేపదే హామీ ఇస్తూ కాలయాపన చేస్తూ 15 నెలల గౌరవ వేతనాలు ప్రాజెక్టు వారు జీతాలు ఇవ్వకుండా మభ్యపెడుతున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.5 నుండి రూ.7 లక్షలు రావాల్సి ఉందని, చేసిన రుణాలకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 5 నెలల బకాయి వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. సంక్రాంతి, శివరాత్రులతో పాటు వచ్చేరంజాన్ ఉగాది పండగలపూట కూడా ఈ ఉద్యోగులు పస్తులు ఉండాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. డిఆర్‌ఒ జీతాల విడుదలకు అధికార యంత్రాంగంతో మాట్లాడి పరిష్కారం కొరకు కృషి చేస్తామని తెలిపారు.పెండింగ్ జీతాల కొరకు దశల వారి ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ కృష్ణారెడ్డి

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మతో కలిసి మాట్లాడుతూ వైవీయూ గుర్తింపునిచ్చిన అధ్య యన కేంద్రాల్లో ఎంఎ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయ న్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంఎ ఎకనామిక్స్‌లో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. బీకాం, బిబిఎ, బిబిఎం డిగ్రీ చేసిన వారు మాత్రమే ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఏదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూత నంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్ మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభిం చామన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్, సమాన అర్హత గల వారు ప్రవేశానికి అర్హులన్నారు. సర్టిఫికెట్ అండ్ డిప్లమా కోర్సులలో సైకాలజీ- కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్, లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్, ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా అనాలసిస్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అని తెలిపారు. ఈ కోర్సులన్నీ డిస్టెన్స్, ఆన్లైన్ లర్నింగ్ విధానంలో ఉంటాయన్నారు. వివరాలకు https://code.yvu.edu.inను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేంద్ర

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ చేనేత ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పీలేరుకు చెందిన పోలిశెట్టి సురేంద్ర నియమితులయ్యారు. జాతీయ చేనేత ఐక్య వేదిక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ జాతీయ చేనేత ఐక్య వేదిక ద్వారా చేనేత కార్మికుల పరిరక్షణకు, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తారని, తనకు ఈ గుర్తింపు రావడానికి సహకరించిన టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని గిరిజన జాతిలోని బంజారా, ఎరుకుల, యానాది కులాల గిరిజన బిడ్డల పైన జరిగే దాడులను అరికట్టాలని ఎపి బంజారా సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేంద్రనాయక్ చౌహన్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రోజు రోజుకు గిరిజనుల పైన దాడులు అధికం అయ్యాయని, వాటిని అరికట్టడంలో అధికారులు విఫలం అయ్యారని అన్నారు. వారం రోజుల్లోనే గుర్రం కొండ మండలంలో ఎరుకుల మహిళపైన అతిదారుణంగా కొందరు గుండాలు దాడి చేశారని తెలిపారు. మదనపల్లి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బంజారా మహిళ సునీతబాయి పైన కూడా ఒక గూండా దాడి చేసి గాయాల పాలు చేశాడని అన్నారు. ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోలేదని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసులు నమోదు చేసే విషయంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని, తిరిగి బాధిత గిరిజన ప్రజల పైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన ప్రజల పైన దాడి చేసే వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రజల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని తెలిపారు.

నేటి నుంచి పోషణభీ, పఢైభీ శిక్షణ

ప్రజాశక్తి-పీలేరు

అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం పోషణ్ భీ, పఢైభీ శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ తెలిపారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి పీలేరు ప్రాజెక్టు పరిధిలోని పీలేరు, కె.విపల్లి, కలకడ మండలాల అంగన్వాడీ కార్యకర్తలందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

శిశు గృహానికి మూడు రోజుల చిన్నారి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని సుండు పల్లె రోడ్డులో కెటిసి కల్యాణ మండపానికి ఎదురుగా గల ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశు గృహానికి బుధవారం మూడు రోజుల చిన్నారి చేరింది. జిల్లా పరిధిలోని మొలకలచెరువు మండలం, ఉమాశంకర్‌కాలనీ వద్ద గల ఆదర్శ పాఠశాల వెనుక భాగంలో ఉన్న గుట్టల్లో మూడు రోజుల చిన్నారిని ఎవరో బ్యాగులో పెట్టి వదిలి వెళ్ళిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు, ఐసిడిఎస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని బ్యాగులో ఉన్న చిన్నారిని పట్టణంలోని శిశు గృహానికి తరలించారు.చిన్నారిని ఎవరైనా అపహరించి అక్కడ వదిలారా లేక పోషించలేక ఎవరైనా గుట్టు చప్పుడు కాకుండా అక్కడ వదిలి వెళ్లారా అనే విషయం తెలియాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ చిన్నారి క్షేమంగా శిశు గృహానికి చేరడంతో ఐసిడిఎస్ అధికారులు చిన్నారికి సంబంధించిన వారు ఎవరైనా నెల రోజుల్లో వచ్చి పాపను గుర్తించి తీసుకెళ్లవచ్చునని తెలియజేశారు. అలాకాని పక్షంలో పాపను అనాథగా గుర్తించి ఎవరికైనా దత్తత ఇవ్వడం జరుగుతుందని ఐసిడిఎస్ పీడీ రమాదేవి తెలిపారు.

బ్రెయిలీ రూల్స్ సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

దృష్టిలోపం ఉన్నవారు బ్రెయిలీ రూల్స్ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం శంకరాపురం నందుగల ప్రభుత్వ అందుల పాఠశాలలో 'దృష్టిలోపం ఉన్నవారి ప్రయోజనం కోసం ప్రాంతీయ భాషలో బ్రెయిలీ సాధనాలు మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్నవారు బ్రెయిలీ రూల్స్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాంతీయ భాషా బ్రెయిలీ సాధనాలు దృష్టి లోపం ఉన్నవారికి సహాయపడతాయి, సుకన్య పుస్తకాలయ అనేది ద ృష్టిలోపాలు మరియు ఇతర ప్రింట్ వైకల్యాలు ఉన్న వ్యక్తుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ లైబ్రరీ అని పేర్కొన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లీస్ రీడింగ్ మెటీరియల్, స్క్రీన్ రీడర్లు, బ్రెయిలీ డిస్ప్లే, ఆడియో ఫార్మేట్లు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, నల్సా పథకములు మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆర్.వి.కృష్ణకిషోర్, మండల విద్యా శాఖాధికారి ఇర్షాద్ అహ్మద్, అంధుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెబనైజర్, ఉపాధ్యాయులు రాజ, నరసింహులు, ప్రత్యేక పిల్లలు పాల్గొన్నారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయ తరలింపు ఆపండి

- పార్లమెంటులో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప నుంచి అమరావతికి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ ప్రక్రియను ఆపాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పార్లమెంటులో కోరారు. 2006లో కడప కేంద్రంగా ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. 550 బ్రాంచిల్లో రూ.4,600 కోట్ల మేర లావాదేవీల జరుగుతున్నాయని, ఈ కార్యాలయం పరిధిలో 3,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. వైఎసఆర్, అన్నమయ్య, అంతపురం, సత్యసాయి, కర్నూల్, నంద్యాల, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, తిరుపతి 10 జిల్లాలకు అనుకూలంగా ఉందన్నారు. దీన్ని అమరావతికి తరలించడం వల్ల రాయలసీమ జిల్లాల వారికి దూరం పెరుగుతుందన్నారు. కడప కేంద్రంగా కార్యాలయం ఉండడం వల్ల అన్ని జిల్లాలకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. తరలింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

ప్రజలకు అందుబాటులో ప్రత్యేక ఆధార్ సేవలు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆధార్‌కార్డు లేని, ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు ఉన్న పిల్లల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని స్థానిక 3, 5వ సచివాలయాలు, బోడుమల్లువారిపల్లి సచివాలయంలో ప్రజలకు సౌకర్యంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు మొదటి విడతగా కొన్ని ప్రాంతాల వారికి, 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెండో విడతలు మరికొన్ని ప్రాంతాలవారికి సౌకర్యంగా ఏర్పాటు చేశామన్నారు. నిర్ణీత తేదీల్లో ఆయా ప్రాంతాలకు చెందిన అంగన్వాడీ ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జడ్‌పి చైర్మన్ ఎన్నికపై వైసిపి నాయకుల సమీక్ష

ప్రజాశక్తి - కడప

ఈ నెల 27వ తేదీన జరగబోవు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక గురించి వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్పీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలో చర్చించి తగు సూచనలు చేశారు. ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, మైదుకూరు, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, నాయకులు హాజరయ్యారు.

డిగ్రీలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలోనే లక్ష్యాన్ని నిర్దేశించు కోవాలని శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బుధ వారం శ్రీహరి డిగ్రీ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యా బోధన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి, అర్చన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మదనమోహన్‌రెడ్డి, సిఎన్‌ఆర్ డిగ్రీ కాలేజీ పీలేరు విజయ్ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా కళాశాల పూర్వపు విద్యార్థి, గ్రూప్ వన్ ఆఫీసర్ చందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరంలోనే తన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ కావలసన తాను కొన్ని కారణాల వల్ల గ్రూప్-1 ఆఫీసర్ అయ్యారని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, విజయభారతి తనకు ధైర్యాన్ని ఇచ్చారని తెలి పారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి ప్రయ త్నించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిజిహెచ్ జూనియర్ డాక్టర్ల సంఘం నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-కడప సిటీ : ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బి.విజయ్, డాక్టర్ చరిత, డాక్టర్ పూజ, డాక్టర్ ప్రతిభ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎ.నిఖిల్ సింగ్, డాక్టర్ సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం కళాశాలలోని సమస్యల గురించి వినతిపత్రం సమర్పించారు. వారు కళాశాల సమస్యల గురించి ప్రస్తావించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసి జూడా అసోసియేషన్ సభ్యులకు తెలియజేస్తామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

రీ సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రీ సర్వే పనుల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పందికుంట రెవెన్యూ గ్రామం బత్తినవాండ్లపల్లిలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ శ్రీధర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయి, అందులో డ్రైలాండ్, వెట్ ల్యాండ్ విస్తీర్ణం ఎంత, రీసర్వే ఎప్పుడు మొదలుపెట్టారు, ఎన్ని టీములు సర్వే చేస్తున్నాయి, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలలో రీసర్వే చేశారు, ఇంకెంత చేయాలి అన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామం యొక్క మ్యాపులు, రీ సర్వే చేయాల్సిన ఒఆర్‌ఐ మ్యాపులు కలెక్టర్ పరిశీలించారు. ఒక రోజులో ఎన్ని ఎకరాలు చేస్తున్నారు? రైతులకు నోటీసులు ఇచ్చారా, ఈరోజు ఎంత మంది రైతులకు ఇచ్చారు, ఎంతమంది రైతులు వచ్చారు, నేడు ఎన్ని ఎకరాలు సర్వే పూర్తి చేశారని ఇచ్చిన లక్ష్యం మేరకు తప్పనిసరిగా ప్రగతి సాధించాలని, ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పట్టా భూములు, తదితరాలను పక్కగా సర్వే చేయాలని చెప్పారు. ఏరోజుకారోజు వెక్టరైజేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందరేగా అక్కడి రైతులతో సర్వే ప్రక్రియపై ముఖాముఖి మాట్లాడారు. వారికున్న విస్తీర్ణం, సర్వే చేసిన కొలతలు సరిపోతున్నాయా అని రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడానికి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ తగు సూచనలు జారీ చేశారు కార్యక్రమంలో తహశీల్దారు, మండల సర్వేయర్, విఆర్‌ఒ, విఆర్‌ఎలు, టిఆర్‌ఎస్‌లు, రైతులు పాల్గొన్నారు

ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పిలను నియమించండి

-హోం మంత్రి అనితకు బహుజనసేన వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి సెల్‌కు డిఎస్‌పిలను నియమించాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితను కోరినట్లు బహుజన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు పేర్కొన్నారు. విజయవాడ అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి వంద శాతం ఎస్‌టి, ఎస్‌సి సెల్‌కు డిఎస్‌పిలను నియమిస్తామని చెప్పారని అన్నారు. కాస్త సమయం కావాలని, పర్యవేక్షించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్‌సి, ఎస్‌టి కేసుల పట్ల పోలీసుల వ్యవహారి శైలిపై చర్చించామని అన్నారు. గుర్రంకొండ మండలంలో ఎరుకల అలివేలమ్మపై జరిగిన దాడి సంఘటనను మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సమస్యల పట్ల అలసత్యం వహిస్తే ఖచ్చితంగా ఉద్యమ రూపం తీసుకుంటామని హెచ్చరించారు. మంత్రి సానుకూలత పట్ల ఈనెల 24న విజయవాడలో నిర్వహించాల్సిన ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో చూసిన తరువాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మావిళ్ళ వెంకటేష్, శివ ఉన్నారు.

హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తున్న శ్రీచందు

వారపుసంతలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

వేలంలో రూ.13.49 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వేలంపాట ద్వారా నిమ్మనపల్లి పంచాయతీకి రూ.13,49,400లు ఆదాయం సమకూరినట్లు డిఎల్‌పిఒ నాగరాజ, ఇఒపిఆర్‌డి చలపతిరావు, ఎఒ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక వారపు సంత ఆవరణంలో సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, పంచాయతీ కార్య దర్శి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. వేలంపాటదారులు వేలం లో పాల్గొనగా, వారపు సంతను రూ.7.50 లక్షలకు చింతపర్తికి చెందిన హేమంత్ కుమార్ రెడ్డి దక్కించుకున్నారు. బస్టాండ్ గేటుకు వేలంపాటను నిర్వహించగా రూ.1.41 లక్షలకు రమ ణయ్య దక్కించుకున్నారు. 8 పంచాయతీ షాపింగ్ రూములకు వేలంపాట నిర్వహించగా ఏడా దికి రూ.4,58,400లు ఆదాయం సమకూరింది. వారపు సంత రూ.7.50 లక్షలు, బస్టాండ్ గేటు రూ.1.41 లక్షలు, పంచాయితీ షాపు రూముల బాడుగ (ఏడాదికి) రూ.4,58,400లు, మొత్తంగా 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ.13.49 లక్షల ఆదా యం సమ కూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, సచివాల య కార్యదర్శిలు వెంకటరమణారెడ్డి, రాజేష్, వేలంపాటదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కెజిబివి పాఠశాలలో అర్హులైన బాలికల కోసం అడ్మిషన్లు ప్రారంభమైనవి పాఠశాల ప్రిన్సిపల్ రూత్‌మేరీ బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ పాఠ శాలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి 6,11 తరగతుల ప్రవేశాల కోసం అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని 7,8,9 తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, స్కూల్ మధ్య లో మానేసిన డ్రాప్ అవుట్స్, పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, దారిద్రరేఖకు దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకోవడం జరు గుతుందని పేర్కొన్నారు. దరఖాస్తులను హెచ్‌టిటిఎస్//ఎపి కెజిబివి. ఎపిసిఎఫ్ఎస్ స్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కెజిబి విలో పాఠశాలలో అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమా చారం అందిం చడం జరుగుతుందని చెప్పారు. అడ్మిషన్ల విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే 9885656524 సంప్రదించవచ్చునని ప్రిన్సిపల్ సూచించారు.

లక్కిరెడ్డిపల్లె : రక్తదానం చేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా మంత్రి 'మండిపల్లి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి 43వ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో బుధవారం తెలుగుదేశం శ్రేణులు అంజనారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, దేరంగుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో మూడు రోడ్ల కూడలి వద్ద భారీ కేక్ కట్ చేశారు. చిట్లూరులో సురేందర్‌రెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. నీలకంఠరావుపేటలో ఉపాధికూలీలకు టిడిపి గ్రామ నాయకుడు పెంచల్‌రెడ్డి స్వీట్లు పంచి పెట్టారు. బండపల్లి గ్రామంలో భయ్యా రెడ్డి ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. 20 మందితెలుగు యువత లక్కిరెడ్డిపల్లెలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి హాజరై రక్తదానం చేశారు. కార్యక్రమంలో చంద్రమౌళి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ గౌడ, చెన్నూరుబాబు, చిలేకంపల్లి శివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివారెడ్డి, చంద్రయ్య, శంకర పాల్గొన్నారు. **రాయచోటి :**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసాద్రెడ్డిల జన్మది నం సందర్భంగా పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో టిడిపి యువ నాయకులు మండిపల్లి రాహుల్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ వెంకటరామరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నాగార్జున రెడ్డి, శ్రీనివాసలు నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మి ప్రసాద్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాలలో టిడిపి నాయకులు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లీనాకుమారి మాట్లాడుతూ పేదలు, అన్నార్తులను ఆదుకుంటూ, నిస్సహాయులను, అభాగ్యులను చేర్చుకోవడం వంటి గొప్ప కార్యక్రమాలను చేపడుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ పి.ఆర్య శంకర్ మాట్లాడుతూ తమ అభినవ నేత రాంప్రసాద్ రెడ్డి, లక్ష్మి ప్రసాద్ రెడ్డిల జన్మదిన వేడుకలు వెలుగు సంస్థలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అతని సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక టిడిపి కార్యాలయంలో యువ నాయకుడు యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి స్థానిక టిడిపి కార్యాలయం నందు వైద్యసిబ్బందితో కలిసి డిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్ సుకుమార్, లక్కిడిపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగం, డాక్టర్ మహేశ్వరరాజు, బండారు శ్రవణ్ కుమార్, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ సిద్దయ్య, ల్యాబ్ టెక్నీషియన్ల లతో కలిసి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 200 మంది యువత రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానంలో పాల్గొన్నటువంటి యువ తకు జ్యూస్, బ్రెడ్లు, పండ్ల తోపాటు పాటు ప్రశంస పత్రాలను తహశీల్దార్ శ్రీనివాసులు , డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్ అందించారు. కార్య క్రమంలో నియోజకవర్గ నాయకులతో మండల టిడిపి నాయకులు మాజీ ఎపిఐఐసి చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, జయరాములు, రామాం జనేయులు, దేవాందర్ రెడ్డి, వెంకట్రామ రెడ్డి, పాపయ్య, కార్య కర్తలు పాల్గొ న్నారు.

మహారాజశ్రీ రాయచోటి 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A.No. 721/2024

A.S.No. 10/2024

మద్దూరి గంగులయ్య, S/o నాగయ్య, వయస్సు 56 సం॥, R/o కొత్తకుంట హరిజనవాడ, H/o పొలిమేరపల్లె గ్రామము, టి.సుండుపల్లె మండలము, అన్నమయ్య జిల్లా మరియు ఇతరులు.

Vs

R7. జంగంపల్లె నాగవేణి, W/o వంశీ, వయస్సు 22 సం॥, హిందు, గువ్వల హరిజనవాడ, H/o శిబ్యాల, రాయచోటి మండలము, అన్నమయ్య జిల్లా.

నోటీసు

పై నెంబరు దావాలో పిటిషనర్లు/అప్పిలెంట్లు మద్దూరి గంగులయ్య, మరియు ఇతరులు రెస్పాండెంట్స్ అయిన కె.కాంతమ్మ మరియు ఇతరులపై అప్పీలు దావా దాఖలు చేసియున్నారు. పై దావాలో 7వ రెస్పాండెంట్ జంగంపల్లె నాగవేణి అయిన మిమ్ములను 7వ రెస్పాండెంట్‌గా చేర్చుట కు పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీరు 28.03.2025 తేదీన ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.ఈశ్వరయ్య, M.Com.,B.L.,

టి.వి.రమణ, B.A.,B.L.,

పిటిషనర్లు తరపున న్యాయవాదులు,

రాయచోటి, అన్నమయ్య జిల్లా.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మామిడి పూత పిందె, దశలో అధిక దిగుబడులు పొందడానికి సమగ్ర పోషక నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం హెడ్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కెఎం.యువరాజు పేర్కొన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రవిచంద్రబాబు అధ్యక్షతన రైల్వే మండలంలోని ఉద్యాన పరిశోధన స్థానం అనంతరాజుపేటలో మామిడి పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఫ్రూట్ కవర్స్ వినియోగము, మార్కెటింగ్ పైన రైతు శిక్షణ, అవగాహన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడవల్సిందిగా సూచించారు. ఉద్యాన కళాశాల అనంతరాజుపేట కీటక విభాగం సహాధ్యాపకులు డాక్టర్ జి.శారద మాట్లాడుతూ తేనె మంచు పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. ప్రారంభ దశలో తేనేమంచు పురుగు నివారణకు వేప నూనె 1500 పిపియం 5 మీ.లి లీటర్ నీటికి లేదా అజాడిరెక్టిన్ 10000 పిపిఎం 1 ఎం.ఎల్ం జిగురు మందు 0.5 మీ.లి లీటర్ కలిపి పిచికారి చేయాలన్నారు. పచ్చి పూత దశలో నివారణకు బుప్రోఫుజిన్ 20 శాతం, అసిపేట్ 50 శాతం, 1గ్రాము లేదా డైనోటోఫ్యూరాన్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. బిఎంవి అనే మైక్రోబియల్ మందును ఎకరాకు 100మి.లీ 500 లీటర్ల నీటిలో కలిపి డ్రిప్‌లో వదలాలని తెలి పారు. ఇప్పుడు పిందెలు రాలుతున్నట్లు అనిపిస్తే ప్లానోఫిక్స్ అనే మందును 500 లీటర్ల నీటికి 100 మి.లి కలిపి స్ప్రే చెయాలని తెలిపారు. తామర పురుగులు నివారణకు నీలి రంగు జిగురు అట్టలను చెట్టుకు ఒకటి చొప్పున కట్టాలి, కానుగ సోప్ ను 7.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి స్ప్రే చెయ్యాలన్నారు. ఒకవేళ తామర పురుగులు ఉధృతి అధికంగా ఉంటే ఫిప్రోనేల్ 2 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ కలిపి పిచకారి తెలిపారు.ఎట్టి పరిస్థితులలో సింథటిక్ పైరిత్రోయిడ్స్ మందులను మామిడిలో వాడకూడన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవి చంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన శాఖ తరపున మామిడి కాయలకి ఉపయోగించే కవర్లు సబ్సిడీలో ఆదిస్తున్నామని చెప్పారు. అన్నారు. కావలసిన రైతులు మీ దగ్గరలోని రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకొని పొందవచ్చు అన్నారు.ఒక్కొక్క కవర్ ధర రూ.2.20, ఇందులో సబ్సిడీ రూ.1, రైతు భాగంగా రూ.1.20 చెల్లించి పొందవచ్చునని అన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం, అనంతరాజుపేట తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ జి. సందీప్ నాయక్ మామిడిలో బూడిద తెగులు,పక్షి కన్ను తెగులు, ఇతర తెగులు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు కార్యక్రమంలో కోడూరు, రాజంపేట ఉద్యాన అధికారులు యం. వెంకట భాస్కర్, జి.సురేష్ బాబు, కోడూరు వ్యవసాయ అధికారి సుధాకర్,రైతు సేవ కేంద్ర సిబ్బంది, కోడూరు రాజంపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాల నుంచి 310 మంది మామిడి రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజు

ప్రజలకు అందుబాటులో 104 వైద్య సేవలు

వైద్య సేవలను అందిస్తున్న 104 సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దొండ్లోపల్లి గ్రామంలో బుధవారం పేద ప్రజ లకు అందుబాటులో 104 వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని డాక్టర్ మనోజ్‌చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలి పారు. మెరుగైన వైద్యం నోచుకోని వారికి కూడా 104 వాహనం ద్వారా గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దకే వెళ్లి అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. రోగికి చికిత్సతో పాటు మందులను పంపిణీ చేసి ఆరోగ్య సలహాలు అందిస్తున్నామని అన్నారు. ప్రతి సచివాలయానికి నెలకు రెండుసార్లు 104 వాహ నం అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 67 రోగాలకు సంబంధించి మందులు అందు బాటు లో ఉన్నాయని అన్నారు. సిబ్బంది దగ్గర దాదాపు 150 మంది రోగులు చికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. రోగికి అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రికి పంపుతామని తెలిపారు. 104లో బిపి, షుగర్, యూరిన్ టెస్ట్ తదితర పరీక్షలు చేస్తున్నా మన్నారు. వేసవికాలం కాబట్టి ప్రజలు వడదెబ్బ బారిన పడ కుండా తీసు కోవాల్సిన పలు జాగ్రత్తలు సూచనలను తెలియజేశారు. కార్యక్ర మంలో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్ఒ, గ్రామస్తులు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కె టింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి, వాల్యూ చైన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో రైతులు పండించిన ఆరోగ్యకరమైన తాజా కూరగాయలు ఆకుకూరలు, ధాన్యం, మొదలైనటువంటి ఉత్పత్తులు పొడు లు నాణ్యంగా మంచిగా ప్యాకింగ్ చేసి వినియోగదారులకు అందిం చాలనే ఉద్దేశ్యంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ని ఏర్పాటు చేశామని తెలి పారు. మండలంలోమూడు స్టాల్స్‌ను వారంలో మూడు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పౌష్టిక ఆహార ఉత్పత్తులను అందించే కార్యక్రమాన్ని డిపిఎం ప్రవీణ్‌కుమార్, ఎంటిఎల్ చందురెడ్డి ఆధ్వ ర్యంలో చేపడు తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న మాస్టర్ ట్రైనర్ పద్మావతి

ఆర్థిక స్వావలంబనకే ఆదరణ-3 పథకం : ఎంపిడిఒ

తంబళ్లపల్లి : బిసి కుల వృత్తులదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉపేందర్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వృత్తి కళాకారుల ఆర్థిక స్వావలంబనకే ప్రభుత్వం ఆదరణ 3 పథకాన్ని తీసుకొచ్చిందని ఎంపిడిఒ అజ్ మస్రూర్ తెలిపారు. వివిధ రకాల వృత్తికళాకారుల ప్రతినిధుల సమావేశం బుధవారం స్థానిక మదనపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశం నిర్వహించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ సహకార సంస్థ ఆధ్వర్యంలో ఆదరణ-3వ విడత కార్యక్రమం అమలు కడప, అన్నమయ్య జిల్లాల వెనుకబడిన తరగతుల సంక్షేమ సహకార సంస్థ కార్యనిర్వాహక డైరెక్టర్ కార్యాలయం ఆదేశాలు మేరకు వృత్తి కళాకారుల నైపుణ్యతను వ, ఆర్థిక స్వావలంభనను పెంపొందించుటకు ఈ కార్యక్రమాన్ని కులసంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయి బ్రాహ్మణులు, సంగీత కళాకారులు, కొలిమి వృత్తివారు, స్వర్ణకారులు, కార్పెంటర్లు, సాధారణ విద్యుత్ పరికరాల పనివారు, చేపల(బెస్తలు),కుమ్మరి, యాదవ సంఘాల, రజక, రాతి (శిల్పి) కళాకారుల, భవన నిర్మాణ, దర్జీ సంఘాలు, కల్లు సంఘాల, చేనేత కార్మికుల సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు సంఘాలు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదరణ-3వ విడత అమలు చేసేందుకు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏయే కులానికి లేదా ఏయే సంఘానికి ఏయే పనిముట్లు అందజేస్తారో ఆ వివరాలు తెలియజెస్తే వాటిని తమ సంఘాల్లోని అర్హులైన సభ్యులు సద్వినియోగం చేసుకొనే విధంగాఅవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సంఘాలకు ఏదైనా కొత్త పరికరాలు కావాలంటే వినతిపత్రం ఇవ్వాలని కోరారు. 20 నుంచి 40 ఏళ్లలోపు మహిళలకు టైలరింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ప్రభాకర్, రజక సంఘం నాయకులు ముదిమడుగు రాంమూర్తి, చేనేత నాయకులు మోడెం నాగరాజు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలో ఉన్న అన్ని బిసి కుల వృత్తుల సంఘాల నాయ కులతో ఆదరణ-3 పథ కంపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమా వేశం బుధవారం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ దిలీప్‌కుమార్ పేర్కొ న్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో వారివారి వృత్తులలో వారికి నవీకరించిన పనిముట్లను ఏర్పాటు చేయుటకు వారి నుండి కొత్త రకమైన పనిముట్లు జాబితాను తయారుచేసి జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని అన్నారు. కొత్తరకం పనిముట్లతో వారి ఆదాయం, నైపుణ్యం పెంపొందిం చుటకు ఈ కార్యక్రమం రూపొందించినట్లు చెప్పారు. కార్యక్ర మంలో అధి కారులు, బిసి కుల వృత్తుల ప్రజలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బిసి కులస్తులతో, కులవృత్తిదారులతో ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ-3 పథకం ద్వారా కులవృత్తులకు ఆదాయం పెంచడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని అన్నారు. కులవృతదారులకు అవసరమైన పనిముట్లను గుర్తించి, నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు రాజన్న, రాజేష్ పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం తెలిపారు. కులవృత్తి ఆధారంగా వారికి కావాల్సిన పనిముట్లు వివరాలను పూర్తిస్థాయిలో అడిగి తెలుసుకున్నట్లు ఆయన తెలిపారు. . కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సచివాలయం పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:**. ఆదరణ-3 పథకం ద్వారా బిసి కులాలలోని కులవృత్తులు, చేతివృత్తులు నిర్వహించుకునే వారికి అత్యాధు నిక పరికరాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఎంపిడిఒ ఉపేందర్ ఒడ్డి పేర్కొన్నారు. బిసి కులాల కుల వృత్తులదారులతో సమావేశం నిర్వహిం చారు. ప్రస్తుత పరిస్థితులలో అత్యాధునిక పరికరాలు కావల సిన వారు అధికారులకు తెలియపరిస్తే వారు అడిగిన పరికరాల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యాలయ ఎఒ థామస్, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కన్నెమడుగు జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. టిబి సూపర్వైజర్ రామకృష్ణ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంకాలం జ్వరం రావటం, వంటి లక్షణాలు ఉన్న వ్యక్తులు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన రోగికి ప్రభుత్వం తరపున ప్రతి నెలా వెయ్యి రూపాయలు ఆరు నెలల పాటు రోగి బ్యాంకు ఖాతాలో జమ చెయ్యడం జరుగుతుంది. వ్యాధి నిర్ధారణ అయిన రోగికి ఇంట్లో వారికి టిబి జబ్బు రాకుండా ముం దస్తు పరీక్షలు నిర్వహించి వారికి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టిబి యూనిట్ సూపర్వైజర్, ఎంఎల్ హెచ్‌పి సరిత, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కలకడ:** క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున తెలిపారు. కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదని ప్రాణాంతకంగామారుతుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, టిబి యూనిట్ పర్యవేక్షకులు పవన్ కుమార్, హెల్త్ ఎడుకేటర్ రాజమ్మ, పర్యవేక్షకురాలు రామకృష్ణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ హజీరబీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ : టిబిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లికార్జున

మారెమ్మ జాతరలో వైసిపి నాయకులతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ఘనంగా దండు మారెమ్మ జాతర

- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం ముదివేడులో దండు మారెమ్మ జాతర బుధవారం అంగ రంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తల ఆహ్వానం మేరకు జాతరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకి ఆలయ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన జాతరలలో దండు మారెమ్మ జాతర ఒకటని తెలిపారు. ప్రతి ఏడాది ఈ జాతరను ఎంతో వైభవంగా నిర్వహిస్తారని, అదే తరహాలో ఈ ఏడాది ఈ జాతరను ఆలయ కమిటీ, గ్రామస్తులు అద్భుతంగా నిర్వహించారని అభినందించారు. ఎమ్మెల్యే వెంట ముదివేడు తూపల్లి, దాదంవారిపల్లి, వేపలపల్లి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

నూతన బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-కలకడ

నూతన బోరు ఏర్పాటు చేసి నీటి దాహార్తిని తీర్చినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ముడియంవారిపల్లి పంచాయతీలో నీటి ఎద్దడి ఉన్న కారణంగా పంచాయతీ నిధులతో సర్పంచ్ శాంతమ్మ ఆధ్వర్యంలో నూతనంగా బోరును ఏర్పాటు చేసి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్నట్లు గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదులు రావడంతో దానిని అధిగమించడానికి పంచాయతీ నిధులతో నూతనంగా బోరుకు మోటారు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్న తరుణంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం వచ్చేది వేసవికాలం కాబట్టి నీటిని పొదుపుగా వాడుకొని గ్రామంలోని అన్ని పల్లెలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ చైర్మన్, ఉపాధ్యాయుడు రమణ

పాఠశాల ప్రచార కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల దలవాయిపల్లిలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు మజీద్ పంచా యతీ సెక్రటరీ బాలాజీ ఆధ్వర్యంలో పాఠశాల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. పిల్లలు నటించిన లఘు చిత్రాలను ప్రారం భించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలకు ఇలా కరపత్రాలు ప్రచురించడం వినూత్న ఆలోచన అని పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి నాణ్యమైన ఒత్తిడి లేని విలువలు కలిగిన విద్యను అందించడమే తమ పాఠశాల ప్రధాన ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మల్లికార్జున, సిఆర్‌పి ఆనంద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : నాటుసారా విక్రయిస్తున్న నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ భీమలింగ తెలిపారు. మదనపల్లె ఈశ్వరమ్మ కాలనీకి చెందిన బాలాజీనాయక్ బుగ్గకాలవలో నాటుసారా విక్రయిస్తుండగా, స్క్వాడ్ అధికారులు దాడులు జరిపి నిందితుడి వద్ద పది లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు చెప్పారు. సారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్య హత్య కేసులో భర్తను అరెస్టు చేసినట్లు మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం, బెలగాం జిల్లా, బాటకుర్తి తండాకు చెందిన సంగీత, కుమార్ ప్రేమించుకున్నారని అన్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించక పోవడంతో ఏడాదిన్నర క్రితం గ్రామం నుంచి పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. గుర్రంకొండ మండలంలోని మర్రిపాడుకు వచ్చి ఓ రైస్ మిల్లులో కూలి పనులు చేసుకుంటూ స్థిరపడ్డారని అన్నారు. కుమార్ మద్యానికి బానిసై పిల్లలు పుట్టలేదని భార్యను వేధించేవాడని అన్నారు. గత నెల 28 శివరాత్రి రోజున భార్య సంగీతను పథకం ప్రకారం కుమార్ హత్య చేశాడని తెలిపారు.. ఆపై తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులను నమ్మించి మృతదేహాన్ని గుట్టుప్పుడు కాకుండా ప్రయివేట్ అంబులెన్స్ లలో బెలగాంలోని బాటకుర్తి తండాకు తీసుకెళ్లాడని అన్నారు. అక్కడ సంగీత మృతదేహాన్ని కాల్చిసి మిన్నుకుండిపోయాడని అన్నారు. మర్రిపాడు గ్రామస్తుల సాయంతో హత్య జరిగినట్లు నిర్ధారించిన గుర్రంకొండ ఎస్ఐ మధు రామచంద్రుడు, వాల్మీకిపురం సిఐ ప్రసాద్‌బాబు హత్య కేసును లోతుగా దర్యాప్తు చేపట్టి నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించదంతో అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

నిందితుడి అరెస్టును చూపుతున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు